## లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం



లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ఓ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు అన్నారు. చందానగర్ ఇంజినీరింగ్ ఎన్‌క్లేవ్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ఓ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ సేవల్లో సభ్యుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మన్ కరుణాకర్ గౌడ్, కార్యదర్శి సుధీర్, జోన్ చైర్మన్‌లు కొండా విజయ్‌కుమార్, శేఖర్ గౌడ్, లయన్స్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణగౌడ్, యాదగిరి గౌడ్, అశోక్ గౌడ్, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శాంతిభూషన్ రెడ్డి పాల్గొన్నారు. *– మాదాపూర్, అక్టోబర్ 3*

## ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 3: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకొని వృథాగా పోతున్న నీటిని అరికట్టి భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందించే దిశగా ఆలోచనలు చేయాలని కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ డీజీఎం రాకేశ్, మేనేజర్ శివప్రసాద్ సూచించారు. గురువారం జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డినగర్‌కాలనీ ఫేస్–1లో ఇంటింటా పర్యటించి ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తూనే సీవరేజ్‌లైన్ల లీకేజీలపై సందర్శించి సమస్యను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూదుల సంపత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, సలహాదారులు సత్యరామ్, సభ్యులు జనార్దన్, రమేశ్, జల మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్, అక్టోబర్ 3: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయానగర్‌కాలనీలో రూ.17లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాలనీల్లో మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**కుత్బుల్లాపూర్‌లో...**

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 3:కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులో రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కౌన్సిలర్ డప్పు కిరణ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

# రోడ్డు పనులు వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబర్ 3 : విజ్ఞాన్‌పూరి కాలనీలో రోడ్డు పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కాలనీలో నూతనంగా చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులను త్వరగా పూర్తి చేయాలని, రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను కోరారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఈఈ గోవర్ధన్, నేతలు సంతోష్, ప్రభాకర్, కాలనీవాసులు ఉన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

సీఎం రిలీఫ్ ఫండ్ కష్టాల్లో ఉన్న పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 39మంది లబ్ధిదారులకు రూ.16,94,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

**చెరువుల వివరాలు ఇవ్వాలని దరఖాస్తు**

సమాచార హక్కు చట్టం ప్రకారం..కూకట్‌పల్లి నియోజకవర్గంలోని చెరువులు, కుంటల పూర్తి విస్తీర్ణం, చెరువుల్లో జరిగిన ఆక్రమణలు, చెరువు శిఖం భూములు, పట్టా భూముల వివరాలను ఇవ్వాలని కోరుతూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు మేడ్చల్ జిల్లా కలెక్టర్, నార్త్ ట్యాంక్స్(ఇరిగేషన్) ఈఈ, కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల తహసీల్దార్లకు దరఖాస్తు చేశారు. కూకట్‌పల్లి మండలంలోని ముళ్లకత్వ చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువు, సున్నంచెరువు, రంగధాముని(ఐడీఎల్) చెరువు, నల్లచెరువు, ఖాజాకుంట, బాలానగర్ మండలంలోని ఓల్డ్‌బోయిన్‌పల్లి



కూకట్‌పల్లి విజ్ఞాన్‌పూరికాలనీలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఈఈ గోవర్ధన్, కార్పొరేటర్

బోయిన చెరువుల పూర్తి విస్తీర్ణం ఎంత? ఆయా చెరువుల్లో చెరువు శిఖం భూమి ఎంత? పట్టా భూములు విస్తీర్ణం ఎంత? చెరువులు ఎంత విస్తీర్ణంలో ఆక్రమణలను గురి అయ్యాయి? ఆక్రమణలను గురైనా భూములు చెరువు శిఖం భూములా? పట్టా భూములా?, వంటి పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు.

**చెరువుల ఆక్రమణలపై పూర్తి విచారణ జరపాలి..**

చెరువుల ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఏండ్ల తరబడి నివసిస్తున్న నిరుపేదలు సమిదలు కాకుండా... చెరువులను కాపాడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నల్లచెరువు, సున్నం చెరువు ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రకటనపై ఎమ్మెల్యే కృష్ణారావు స్పందిస్తూ.. సున్నంచెరువులో అక్రమ కట్టడాలను కూల్చిన పరిధి.. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోకి రాదని, శేరిలింగంపల్లి పరిధిలోకి వస్తుందన్నారు. 2018లోనే కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువుల ఆక్రమణలపై విచారణ జరపాలని కోరిన మొదటి వ్యక్తిని నేనేనని తెలిపారు. నిరుపేదలు ఇందులో సమిదలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వైభవంగా బతుకమ్మ సంబురాలు



కేపీహెచ్‌బీకాలనీ : బాలాజీనగర్ ప్రగతినగర్‌లోని శ్రీసాయివిద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల



బాలానగర్ : ఫతేనగర్ జవహర్‌కాలనీలో శ్రీబాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



మియాపూర్: వివేకానందనగర్ డివిజన్‌లో ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజా దేవిరంగారావు



మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం నాగాలాండ్‌లో ఈనెల 18నుంచి21వ తేదీ వరకు నాగాలాండ్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు – మాదాపూర్

## విద్యార్థుల మధ్య ఘర్షణ నలుగురిపై కేసు

దుండిగల్,అక్టోబర్ 3: బీటెక్ విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఇద్దరు గాయపడగా,నలుగురిపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. నిర్మల్‌కుమార్, సోహైల్ అనే యువకులు దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రెండు రోజుల కిందట కళాశాల క్యాంటీన్ వద్ద నిర్మల్‌కుమార్ తన స్నేహితుడనుకుని సోహేల్ భుజం పై చెయ్యి వెయ్యడంతో ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకున్నది. దీంతో నిర్మల్‌కుమార్ సారీ చెప్పడంతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది. బాధిత విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి..

రాష్ట్రంలో న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్నాయని, న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకరావాలని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ద గోవర్ధన్‌రెడ్డి కోరారు. మాదన్నపేట పోలీసులు ఓ న్యాయవాదిని విచక్షణ రహితంగా కొట్టడాన్ని నిరసిస్తూ..గురువారం కూకట్‌పల్లి కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నేతలు నటరాజ్, యాదయ్య, సదాలక్ష్మి, ఖలీల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. *–కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3*

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



బాలాజీనగర్ డివిజన్‌లోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. గురువారం కాలనీ 15వ ఫేజ్‌లో జల మండలి అధికారులు పర్యటించి డ్రైనేజీ సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో పాతడ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతిందని.. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు, కాలనీవాసులు కోరారని, ఈ మేరకు స్థానికంగా పర్యటించి డ్రైనేజీ సమస్య పరిశీలించామన్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్‌లను వేసేందు కాలనీవాసులు అదనపు చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జీఎం ప్రభాకర్‌రావు, డీజీఎం శిరీషా, మేనేజర్ సలోమి, స్థానిక నేతలు ఉన్నారు. *– కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 3*

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్, అక్టోబర్3: బాచుపల్లిలోని టయోటసర్వీస్ సెంటర్ వద్ద గుర్తు తెలియని 45ఏండ్ల వయస్సున్న వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు బాచుపల్లి పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. మృతుడి ఒంటిపై బ్రౌన్‌కలర్ టీషర్ట్,గ్రేకలర్ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. తెల్లటి గడ్డం, శరీరం బలహీనంగా ఉండటంతో మృతుడిని భిక్షగాడిగా భావిస్తున్నారు. శవాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రాజకీయాలకతీతంగా డివిజన్‌ల అభివృద్ధి

మియాపూర్, అక్టోబర్ 3:రాజకీయాలకు అతీతంగా డివిజన్‌లలో సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులను కల్పిస్తానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు చేపట్టాల్సిన పనులపై కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే గాంధీని గురువారం ఆయన నివాసంలో కలుసుకుని వినతిపత్రం సమర్పించారు.హన్మంతు , జలేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, దొరబాబు, శేఖర్, ప్రసాద్, సుమన్, ప్రకాశ్, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో మౌలిక వసతులు కల్పించండి

శేరిలింగంపల్లి, అక్టోబర్ 3: గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల విషయమై స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని గురువారం కలిశారు. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, అభివృద్ధి పనుల వేగవంతం చేయాలని, డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతు నాయక్, జలందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శేఖర్, ప్రసాద్, సుమన్, ప్రకాశ్, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నుంచి ప్రత్యేక బస్సులు

బాలానగర్, అక్టోబర్ 3: దసరా పండుగను పురస్కరించుకొని టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి డిపో మేనేజర్ డి.హరి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం కూకట్‌పల్లి డిపో నుంచి జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి విలేజ్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఏపీలోని విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, కర్నూల్ అనంతపురం ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జీహెచ్ఎంసీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 3: కుత్బుల్లాపూర్–కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో శానిటేషన్, ఎంటమాలజీ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్ కమ్యూనిటీహాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలకు సంబంధించి పలువురు వైద్యులచే కార్మికులకు ఉచితంగా పరీక్షలు చేయించి, వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న నిందితుల అరెస్ట్

బాలానగర్, అక్టోబర్ 3: మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు షేక్ ఫయాజుద్దీన్, మాధవయ్య సూచనల మేరకు ఫతేనగర్‌లో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సీఐ వేణుకుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం, మంగెల గ్రామానికి చెందిన పడిగెల వెంకటేశ్(24), అదే ప్రాంతానికి చెందిన మేడపట్ల తరుణ్ (24) కలిసి ఫతేనగర్ ఇందిరాగాంధీపురం సమీపంలోని శ్మశానవాటిక వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. అక్కడే మాటువేసిన ఎక్సైజ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. విషయాన్ని ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.




